క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనగానపల్లె: మండలంలోని గులాంనబీపేట గ్రామంలో బుధవారం భక్తిశ్రద్ధల మధ్య పెద్దమ్మ జాతర ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

కోవెలకుంట్ల: ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీడీ సాంబశివరావు సూచించా రు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టే మామిడి, నిమ్మ, చీని, సపోట, జామ తదితర పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా,ఈఓపీఆర్‌డీ రాధిక, ఉపాధి పథక ఏపీఓ శ్రీవిద్య,టెక్నికల్,ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలి

డోన్ టౌన్: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు జతపరిచిన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలలను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ బద్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6వ తేదీ సాయంత్రం 5గంటల లోపల ఆన్‌లైన్ దరఖాస్తులను వెరిఫికేషన్ చేయించుకోకుంటే వారిపేర్లు మెరిట్ లిస్టులో నమోదు కావన్నారు. అలాంటి వారికి సీట్ అలాట్‌మెంట్ వీలుకాదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 585 మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ కేవలం 110 మంది మాత్రమే సర్టిఫికెట్ల వెరిపికేషన్ చేయించుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ఐటీఐలో వెరిపికేషన్ చేయించుకోవాలని సూచించారు.

చీరల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ భవనంలో మహావీర్ రాణాప్రతాప్‌సింగ్ జయంతిని పురష్కరించుకుని బుధవారం పట్టణానికి చెందిన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కోవెలకుంట్లకు చెందిన రోటరీక్లబ్, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు బాలాజీ సింగ్ సొంత నిధులతో గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు చీరెలు, జాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నాగేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, బాలాంజనేయరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవాసవి విద్యా చేయూతకు రూ.1.50 లక్షల విరాళం

డోన్ టౌన్: ఆవోపా సంఘం ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏర్పాటు చేసిన శ్రీవాసవి విద్యా చేయూత పథకానికి కర్నూలుకు చెందిన మారదుగు నరసింహస్వామి, తులసమ్మ దంపతులు రు.1.50 లక్షల విరాళాన్ని అందించినట్లు ఆవోపా సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన జొన్నలగడ్డ మాధవి తల్లిదండ్రులు విరాళం అందించారన్నారు. అలాగే వీరి కుమారుడు బళ్లారివాసి మారదుగు రఘు ప్రసన్న, వసుంధర దంపతులు ప్రతియేటా రూ.5వేలు అందజేస్తున్నారన్నారు. దాతలు అందజేస్తున్న మొత్తాన్ని బ్యాంక్‌లో జమచేసి వచ్చే వడ్డీతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామని తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా శివకుమార్

డోన్ టౌన్:వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కార్యదర్శిగా ఉన్న ఆదినారాయణను ధర్మవరం వ్యవసాయ మార్కెట్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో డోన్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌కు అధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనారోగ్యంతో దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లిన ఆదినారాయణ బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టి శివకుమార్‌కు రికార్డులను అప్పగించి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం!

- సాగుకు అన్నీ సానుకూలం
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు
- ఏటేటా పెరుగుతున్న కంది సాగు
- నేడు రైతు ఖాతాల్లో జమ కానున్న పెట్టుబడి సాయం



దుక్కిదున్నతున్న ఓ రైతన్న

బేతంచెర్ల: ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధం అవుతున్నాడు. కోటి ఆశలతో పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నాడు. గతంతో పోలిస్తే నాలుగేళ్లుగా సాగుకు అన్ని పరిస్థితులు సానుకూలంగా మారుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, వ్యవసాయ అధికారుల సహకారం అందజేస్తుండడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏ పంట వేస్తే లాభాదాయకంగా ఉంటుంది.. తదితర వివరాలు తెలుసుకుని కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే భూసార పరీక్షలు పూర్తయ్యాయి. ఈ మేరకు అధికారులు సలహాలు సూచనలు చేశారు. పంట మార్పిడిని ప్రోత్సాహిస్తున్నారు. బేతంచెర్ల మండలంలో మొత్తం సాధారణ సాగు 13,155 హెక్టార్లు కాగా 2018–19లో 12,452 హెక్టార్లలో సాగయ్యాయి. 2019–20 లో 13,159 హెక్టార్లలో, 2021లో 13,400, 2022లో 13,500 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు రైతులు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో 13600 హెక్టార్లతో పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారుల అంచనా. మండలంలో సుమారు 80 శాతం వర్షాధారంగా 20 శాతం బోరుబావుల కింద పంటలు సాగవుతున్నాయి. అయితే ఏడాదికేడాది కంది పంట సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

మండలం	రైతులు	పెట్టుబడి సాయం
డోన్	13,872	7,62,96,000
ప్యాపిలి	13,641	7,51,15,500
బేతంచెర్ల	8916	4,90,38,000

రైతన్నకు వెన్ను దన్నుగా ప్రభుత్వం

రైతు సంక్షేమానికి సీయం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీఠ వేశారు. గ్రామాలో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు తోపాటు రైతన్నలకు వెన్ను దన్నుగా నిలుస్తూ పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందజేస్తుండడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల గణాంకాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా 34,429 మంది రైతులకు రూ.5,500 చొప్పున రూ.20,04,49,500 పెట్టుబడి సాయం జూన్ 1న అందనుంది. ఖరీఫ్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందజేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సాయం మరువం



రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సాయం మరువం. పెట్టుబడి సాయం అందజేస్తున్నందున వ్యవసాయానికి సంబంధించిన ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. అదేవిధంగా ఖరీఫ్, రబీ సీజనలో గ్రామంలోనే వేరుశనగ, శనగ విత్తనాలు రాయితీపై ఇవ్వడం సంతోషకరం. రైతును ఆదుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– యాదగిరి వెంకటేశ్వర్లు, అంబాపురం గ్రామం

రైతు ముంగిటకు సేవలు



ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు ముంగిటకే సేవలు అందజేస్తున్నారు. ప్రత్యేకించి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. సాగు సలహాలతోపాటు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేయడం చాలా గొప్ప విషయం. రానున్న రోజుల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఇంకా మెరుగైన సేవలు అందుతాయని అనుకుంటున్నా.

– మునేశ్వర్‌రెడ్డి, ఆర్‌కొత్తపల్లె ఎంపీటీసీ

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు కావాల్సిన ప్రతి సాయం ఆర్బీకేల్లో అందుతాయి. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. రానున్న ఖరీఫ్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం. అగ్రికల్చర్ అసిస్టెంట్స్ రైతులు సాగు చేయనున్న పంటల వివరాలను సేకరించారు. ఈ మేరకు రైతులకు కావాల్సిన 600 క్వింటాళ్ల వేరుశనగవిత్తనాల, కందులు 60 క్వింటాళ్లు, కొర్రలు –10, పెసలు 5 క్వింటాళ్లు, మినుములు 5 క్వింటాళ్ల కోసం ప్రతిపాదనలు పంపాం.

– ఏఓ కిరణ్ కుమార్

యూనిఫాం సిద్ధం

కొలిమిగుండ్ల: జగనన్న విద్యాకానుకకు సంబంధించి యూనిఫాం బుధవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్‌కు చేరాయి. యూనిఫాం బండిళ్లను ఎంఈఓ జిలానీ బాషా పరిశీలించి స్టోరేజీ పాయింట్‌లో భద్రపర్చారు. మండల వ్యాప్తంగా 4562 మంది విద్యార్థులకు ఎంఈఓ తెలిపారు. విద్యా కానుక కింద ఇప్పటికే మొదటి విడతలో పాఠ్యపుస్తకాలు వచ్చాయని, రెండో విడత గురువారం వస్తాయన్నారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్‌లను అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందన్నారు.

లైన్‌మెన్ పక్కీర పదవీ విరమణ

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన మునగాల పక్కీర బుధవారం పదవీ విరమణ చేశారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో కోవెలకుంట్ల ఏడీ ఖాజావలి, కొలిమిగుండ్ల, అవుకు ఏఈలు ప్రసన్న అంజనేయులు, పక్కీరయ్యతో పాటు వివిధ గ్రామాలకు చెందిన లైన్‌మెన్‌లు, స్నేహితులు, బంధువులు పక్కీరను ఘనంగా సన్మానించారు. పక్కీర సేవలను ఏడీ గుర్తు చేశారు.

నాటుసారా స్వాధీనం

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు క్రాస్ రోడ్డు వద్ద నాటుసారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందినకొనేటి సుబ్బయ్య, కొలుకొండ వెంకటేష్, కొలుకొండ రమణ మోటార్ సైకిల్‌పై సారాను పలుకూరుకు తలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్యాపిలి: పొగాకు ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా వంటివి ఆరోగ్యానికి అత్యంత హానికరమైనవని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 60 రకాల క్యాన్సర్‌లు పొగాకు తీసుకోవడం వలనే సంక్రమించే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా వైద్యాధికారిణి తెలిపారు. అనంతరం ధూమపానం అలవాటును మానుకుంటానని, పొగాకు వల్ల కలిగే హాని గురించి ఇతరులకు అవగాహన కల్పిస్తానని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, సిబ్బంది గంగాదేవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బుధవారం చింతలాయిపల్లెలోని సమత కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిగరెట్, బీడీ, చుట్టా తదితర పొగాకుతో తయారు చేసినా, తాగినా ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని సమత సొసైటీ మేనేజర్ భాస్కర్ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, సమత ఆఫీస్ మేనేజర్ సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: గుట్కా, పొగాకు, ధూమపానం వంటి వాటి వినియోగానికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. బుధవారం మండలంలోని టంగుటూరులో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామంలో అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ మాట్లాడుతూ పొగాకు వాడకం మూలంగా ప్రమాదకరమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణంలో ప్రజాపిత బ్రహ్మకుమారిలు మాధవి, రమాదేవి, పద్మ ఆధ్వర్యంలో వ్యసన ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ధూమపానం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అలాగే సిమెంట్ నగర్‌లో ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ శారదబాయి, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామాంజనేయులు, ఫరిదాభాను, మధు, వరలక్ష్మి, రాజేశ్వరిబాయి, సువర్ణ లక్ష్మి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ అజాంఖాన్, ఎంఈఓ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఐటీఐ విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినయోగం వలన కలిగే దుష్పరినామాలను ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వినోద్ కుమార్ వివరించారు. బస్టాండ్‌లో పొగాకు వాడమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ నాగరాజు, ఈఓ అశ్విన్ కుమార్, పీహెచ్ఎన్ మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, దానమ్మ, తెరిసమ్మ, సీహెచ్‌ఓలు మహమ్మద్ సల్మాన్‌ఖాన్, ఫర్హాన, ఏఎన్‌ఎంలు వెంకటేశ్వరమ్మ, దానమ్మ, మదారమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ టౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురష్కరించుకొని బుధవారం మండల పరిధిలోని బి. రామదుర్గం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నాగన్న, ఆశ వర్కర్ రామాంజనమ్మ పొగాకు వాడకం మూలంగా జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులతో పొగాకు వాడమని ప్రతిజ్ఞ చేయించారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్నడీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

బనగానపల్లెరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విధులు నిర్వహించే వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని టంగుటూరు, పలుకూరు గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా ఉదయం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సిబ్బందితో డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడారు. పీహెచ్‌సీలో రోజువారీగా ఓపీ, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో సుమారు రూ.1.20కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నచిన్న పనులు త్వరగా పూర్తి చేయించి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలుకూరులోని పీహెచ్‌సీని సందర్శించి అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలలో ల్యాబ్‌లో ఉన్న పరికరాలు, రోజువారీ జరుగుతున్న పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పేషెంట్ మానిటరింగ్ మిషన్ పని చేస్తుందా లేదా తదితర వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వం నాడు నేడు పథకం కింద అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసిందని, అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ విజయకుమార్, స్టాఫ్ నర్స్ ధనలక్ష్మీ, ల్యాబ్ టెక్నిషియన్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రత్యేక ముఖ్య కార్యదర్శి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఏపీ వ్యవసాయ సహకారం, పశు పోషణ, పాల అభివృద్ధి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన అధికారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్. లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అధికారికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందిచారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

డోన్ టౌన్: గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు రెవిన్యూ సిబ్బందితో కలిసి కబ్జాలకు పాల్పడుతున్నారని, పరిరక్షించాల ని జగదుర్తి గ్రామ సర్పంచ్ ఏకాంతరెడ్డి, గ్రామస్తులు రాజేశ్వరరెడ్డి తదితరులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం గ్రామస్తులతో కలిసి ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. విషయాన్ని తహసీల్దార్ విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లగా కుటుంబ కలహాలతో ఏర్పడిన వివాదాన్ని ఆపాదించడం సరికాదన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఏవైన వివాధాలు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జా చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం



వలంటీర్లను సన్మానించిన దృశ్యం

ప్యాపిలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టువెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం వలంటీర్లు చిరంజీవి, హరి తదితరులను ఘనంగా సన్మానించారు. మెట్టుపల్లి, ఏనుగుమర్రి సర్పంచ్‌లు ముడియాల మహేంద్రమ్మ, కరణం మోహన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ సేవాభావంతో పని చేస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం ప్రోత్సహాక బహుమతులు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు లోకేశ్వర్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు అంకితభావంతో సేవలు అందించాలి



ముద్దవరంలో వలంటీర్లను సన్మానించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, సర్పంచ్



కొలుములపల్లెలో వలంటీర్లను సన్మానించిన దృశ్యం

బేతంచెర్ల: వలంటీర్లు అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని, ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శివలక్ష్మి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ సూచించారు. బుధవారం మండలపరిధిలోని ముద్దవరం, కొలుములపల్లె గ్రామాల్లో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌లు చిన్న తిమ్మయ్య, చిన్న మద్దమ్మ, ఎంపీటీసీలు మధు, మరియమ్మ పంచాయతీ కార్యదర్శులు నాయక్, మహేష్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సన్మానించి పురస్కారాలను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో వలంటీర్ల పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, బుగ్గన కుమార్‌రెడ్డి, ఎద్దులన్న, చిన్న తిమ్మయ్య, మునిస్వామి, సుబ్బరాయుడు, రమేష్, ఈశ్వర్‌రెడ్డి, చిన్న బుజ్జన్న, సురేష్ రెడ్డి, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో బదిలీల సందడి!

- జూన్ 10 వరకు దరఖాస్తుకు అవకాశం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



కొలిమిగుండ్ల సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి

కొలిమిగుండ్ల: గ్రామ, వార్డు సచివాలయాల పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సచివాలయాల్లో బదిలీల సందడి నెలకొంది. ఇప్పటికే ఉద్యోగులు ఏ ప్రాంతానికి వెళ్లాలి, ఖాళీలు ఉన్నాయా లేదా అని ఆరా తీస్తున్నారు. మూడేళ్లపాటు ఒకేచోట విధులు నిర్వహించిన ఉద్యోగులు వారివారి సమీప ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతర్ జిల్లాలు, స్పౌజ్, మెడికల్ గ్రౌండ్‌లకు ప్రాధాన్యం కల్పించింది ప్రభుత్వం. జూన్ 10వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు 516 ఉన్నాయి. వివిధ శాఖలకు సంబంధించి 4,451 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రొబేషన్ డిక్లేర్ అయినవారు, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీలకు అర్హులు అవుతారు. ప్రభుత్వం బదిలీల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుంది. కొంత మంది ఉద్యోగులు సొంత జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, మరికొందరు పని చేస్తున్న సచివాలయం కాకుండా ఇతర సచివాలయాలకు బదిలీ అయ్యేందుకు సమాయత్తం అవుతున్నారు.

ఇతరులకు అవకాశం: సచివాలయ ఉద్యోగులకు బదిలీల్లో భాగంగా మరింత వెసులు బాటు కల్పించింది ప్రభుత్వం. మొదట నాలుగు కేటగిరీలకే అవకాశం కల్పించింది. ఒంటరి మహిళ లేదా వితంతువు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, దంపతులు వేర్వేరు చోట్ల పని చేస్తున్నవారు..పరస్పర అంగీకార బదిలీ కోరుకుంటున్న వారికి బదిలీలు చేపట్టాలని భావించింది. ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొత్తగా ఇతరుల కేటగిరిని చేర్చుతూ నిర్ణయం తీసేకుంది. వీరు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం మూడేళ్ల తర్వాత బదిలీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. అవకాశం వస్తే అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. కొలిమిగుండ్ల సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ప్రజలకు తమ వంతుగా సేవలు అందించినందుకు ఆనందంగాఉంది. నాలుగు కేటగిరీలతో పాటు ఇతరకులకు బదిలీలకు అవకాశం కల్పించడంతో చాలా మందికి ఊరట లభిస్తుంది.

– విష్ణు, వెల్ఫేర్ అసిస్టెంట్, కొలిమిగుండ్ల సచివాలయం

శుభపరిణామం



మా సొంతూరు కర్నూలు. విధి నిర్వహణలో భాగంగా పెట్నికోట సచివాలయంలో పని చేస్తున్నా. బదిలీలతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఉద్యోగులకు బదిలీ సమయంలో పాయింట్లను పరిగణనలోకి తీసుకునేవారు. సచివాలయ ఉద్యోగులకు అవేమి లేకుండా రిక్వెస్ట్ ప్రాతిపదికన అవకాశం కల్పించడం సంతోషకరం.

– ఖాశీం, పంచాయితీ కార్యదర్శి, పెట్నికోట సచివాలయం

రక్తదానం 'స్ఫూర్తి' సభ్యుల లక్ష్యం

డోన్ టౌన్: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం స్ఫూర్తి సభ్యుల లక్ష్యమని, ఎందరినో ఆదుకుంటూ రక్తదాతలుగా అభినందనలు పొందుతన్నారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తెలిపారు. హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో మంగళవారం ఓ గర్భిణికి 'బీ' పాజిటివ్ రక్తం అవసరం కాగా అక్కడే ఉన్న సంస్థ సభ్యుడు సోంపురం సుధాకర్ రక్తదానం చేసి ఆదుకున్నారన్నారు. కర్నూల్లోని ప్రభుత్వ వైద్యశాలలోనూ ఓ వృద్ధురాలుకు 'ఓ' పాజిటివ్ రక్తం అవసరమని తెలుసుకొని ఉపేంద్ర ఆదుకున్నారని, బుధవారం పట్టణానికి చెందిన ఇద్దరు గర్భిణులకు డెలివరీ సందర్భంగా 'ఓ' పాజిటివ్ రక్తం అవసరం కావడంతో స్ఫూర్తి సభ్యులు పాస్టర్ ప్రభుదాస్, బాలు రక్తం దానం చేశారని తెలిపారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం



సమ్మర్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శ్రీ చౌడేశ్వరిదేవి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ జిల్లా స్థాయి పోటీలను బుధవారం బనగానపల్లె మండల వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, కాటసాని ఓబులరెడ్డి యూత్ సభ్యులు అంబటి రవి కుమార్, సుదర్శన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఎమ్మెల్యే కాటసాని పలు సేవ కార్యక్రమాలతో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. మొదటి బహుమతి రూ.20వేలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి, రెండవ బహుమతి రూ.10వేలను ఎమ్మెల్యే కాటసాని సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి అందజేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మూడవ బహుమతి రూ. 5 వేలను న్యాయవాది నాగేశ్వరరెడ్డి, నాల్గవ బహుమతి రూ.3 వేలను నాగమద్దిలేటి ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మమ్మదా, అత్తార్‌అఖీల్‌హుస్సేన్, నిర్వాహకులు బాలు, హరి, గోవిందు, నందు, నాని తదితరులు పాల్గొన్నారు.